క్లుప్తంగా

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



కామారెడ్డి టౌన్: ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఎం. రమేష్ సూచించారు. స్థానిక విద్యుత్ ప్రగతి భవన్‌లో బుధవారం హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలుంటే తక్షణమే పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీకృష్ణ, వినయ్ కుమార్, విరోనిక, ధర్మ తేజ, విద్యుత్‌శాఖ డీఈలు సాల్యా నాయక్ , వెంకట రంగయ్య, ఉద్యోగ సంఘం నాయకులు బ్రహ్మం, సంపత్ రెడ్డి, వెంకటేష్, మల్లేష్, బి.ఎస్ శ్రీను, మెహర్ బాబా, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని సోమార్‌పేట్ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల కోసం బీజేపీ నాయకుడు సాయిబాబా బుధవారం కుర్చీలను విరాళంగా అందించారు.

కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర



నస్రుల్లాబాద్(బీర్కూర్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని ఆర్డీవో రాజాగౌడ్ సూచించారు. మండలంలోని చించెల్లి, కిష్టాపూర్, బీర్కూర్ గ్రామాల్లో బుధవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజు, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ స్వరూప, ఏఎంసీ చైర్మన్ అశోక్, మాజీ జెడ్పీటీసీ సతీష్ ఉన్నారు.

సీపీఎస్ రద్దుకు డిమాండ్



బాన్సువాడ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 16న కామారెడ్డిలో నిర్వహించ తలపెట్టిన ఉపాధ్యాయుల ర్యాలీని విజయవంతం చేయాలని మండల సీపీఎస్ అధ్యక్షుడు నక్క ప్రవీణ్ కోరారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెలాఖరులోగా పన్ను చెల్లిస్తే రాయితీ



ఎల్లారెడ్డి: ఇంటి పన్నులను ఈనెల ఆఖరులోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. బుధవారం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో ఇంటి పన్నులను వసూలు చేశారు. ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విజయ స్ఫూర్తితో ముందుకు సాగాలి



రాజంపేట: యువకులు విజయ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎస్సై రాజు సూచించారు. బుధవారం రాజంపేటలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. యువకుల్లో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, చైతన్యం పెంపొందించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగం అన్నారు. పది టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నాయని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని ఎస్సై వెల్లడించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పాతరాజంపేటలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో గంప గోవర్ధన్, ఇతర ప్రజాప్రతినిధులు

- ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి రూరల్: పేద ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు పాత రాజంపేట్‌లో బుధవారం ఆయన మెప్మా, డ్వాక్రా మహిళా స్వశక్తి భవన నిర్మాణా శంకుస్థాపన చేసి, మంచినీటి శుద్ధి కేంద్రంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు మన కళ్ల ముందు కన్పిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నా యకులు నిట్టు వేణుగోపాల్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, ఏఎంసీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాద వ్, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, నాయకులు జూకంటి ప్రభాకర్ రెడ్డి, గెరిగంటి లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్ గౌడ్, ఆకుల రూప రవికుమార్, లక్కాకుల రాజ్‌కుమార్, నరేష్, షేక్‌హైమద్, నర్సారెడ్డి, చందన పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదలకు ప్రయోజనం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్నరాజేశ్వర్

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు శిబిరాల్లో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని, ముఖ్యంగా పేదలకు ఎంతో ప్రయోజనం అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్‌రావు సూచించారు. బుధవారం స్థానిక విద్యానగర్ కాలనీ రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవి యాదవ్, కౌన్సిలర్ నజిరొద్దీన్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో కమిషనర్ జగ్జీవన్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరీక్షలు చేయించుకొని కంటికి సంబంధించిన ఇబ్బందులను తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో కంటి వెలుగులో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ రాజనర్స్, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, కార్యదర్శి లావణ్య తెలిపారు.

లింగంపేట: మండలంలోని కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు కోరారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి



నర్సన్నపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో

కామారెడ్డి రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీవో మలహరి సూచించారు. బుధవారం మండలంలోని నర్సన్నపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ ద్యాప హన్మాండ్లు, గ్రామ కార్యదర్శి నవనీత ఉన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారంలో ఏర్పాటు చేసిన నర్సరీని ప్లాంటేషన్ మేనేజర్ సురేందర్ పరిశీలించారు. నర్సరీలో ఉన్న మొక్కల సంఖ్య, ఇతర వివరాలను పంచాయతీ కార్యదర్శి తిరుపతిని అడిగి తెలుసుకున్నారు.

ఐకమత్యంతో పండగలు జరుపుకోవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: కుల, మతాలకు అతీతంగా ఐకమత్యంతో పండగలు జరుపుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. టీఎన్జీవోస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ముస్లిం ఉద్యోగులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి సాయిలు, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు లక్ష్మారెడ్డి

తాడ్వాయి: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన వారు నిరుత్సాహానికి గురికాకుండా మళ్లీ ఆడే క్రీడల్లో విజయం కోసం కృషి చేయాలని ఎల్లారెడ్డి నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి బానాల లక్ష్మారెడ్డి అన్నారు. ఖేలో భారత్–జీతో భారత్‌లో భాగంగా మహాత్మజ్యోతిరావు పులే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా తాడ్వాయిలో బుధవారం రాత్రి బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి క్రీడలు జీవితంలో భాగమని, ఏదో ఒక ఆటలో భాగమైతేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోటీల్లో 56 జట్లు పాల్గొనను న్నాయి. కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర ఏబీవీపీ మాజీ అధ్యక్షుడు రణజీత్‌మోహన్, సైంటిస్టు ఎల్లారెడ్డి, నాయకులు మోహన్‌రావు, బాపురెడ్డి, బంగ్లా చైతన్యగౌడ్, వెంకట్‌రావు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలతో రైతులకు ప్రయోజనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద: వ్యవసాయ మార్కెట్ కమిటీలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యలయంలో బుధవారం నిర్వహించిన మార్కెట్ కమిటీ చైర్మెన్ నాగ్‌నాథ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర కల్పించి పంటలను కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాగుకోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు.

గంజాయి సాగు చేస్తే చర్యలు



పెద్దకొడప్‌గల్: గంజాయిని సాగు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని ఎస్సై కోనా రెడ్డి పోచారం తండా వాసులను హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా పోచారం తండాలో ఇటీవల 69.9 కిలోల గంజాయి పట్టుబడ్డ విషయం తెలిసిందే. దీంతో ఎస్సై బుధవారం స్థానికులతో సమావేశమై గంజాయిని సాగు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటామనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధన్, పోలీస్ సిబ్బంది రాజు, రామేష్ పాల్గొన్నారు.

వ్యాపారంలో లక్ష్యాన్ని చేరుకోవాలి



కామారెడ్డి అర్బన్: వ్యాపారంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకోవాలని స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో పూజ నిర్వహించారు.అనంతరం గత ఏడాది అధిక వ్యాపారం చేసిన పలువురు ఏజెంట్లను అభినందించారు. బ్రాంచ్ మేనేజర్ ఎం.తులసీరాం, ఏబీఎం హిమాన్షు చౌహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



బాన్సువాడ : మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు బుధవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు నియోజకవర్గం ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి గణేష్, మధుసూధన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించాలి



నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి గ్రామంలో ఉన్న శ్రీవాణి పాఠశాలను ఎంఈవో నాగేశ్వర్ రావు బుధవారం తనిఖీ చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా తాగునీటి వసతి కల్పించాలన్నారు. ప్రత్యేక తరగతుల పేరిట మధ్యాహ్నం క్లాసులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ బాలరాజ్ గౌడ్ ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారించాలి

నాగిరెడ్డిపేట: ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూసుకోవాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పోచారం పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు.

కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం, బలగమని ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. బుధవారం కామారెడ్డిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నిలబడిందంటే దానికి కార్యకర్తల త్యాగాలు, వారి కష్టమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు నిర్మిస్తామని, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రూ. 2 లక్షల వరకు రైతు రుణ మాఫీ ఒకేసారి అమలు చేస్తామన్నారు. అనంతరం ఆయన కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ఐడీ కార్డులతో పాటు ప్రమాద బీమా రెన్యూవల్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, కాసుల బాలరాజు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



స్థానికులతో మాట్లాడుతున్న మదన్‌మోహన్

తాడ్వాయి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ పేర్కొన్నారు. మండలంలోని సంగోజివాడి, చందాపూర్ గ్రామాలలో బుధవారం ఆయన చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గడపగడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. యువకులు, మహిళలు స్వచ్ఛందంగా వచ్చి కాంగ్రెస్ లో చేరుతున్నారని వెల్లడించారు.

కూలీల సంఖ్య పెంచాలి



పిట్లంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పిట్లం: మండల కేంద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో వేంకటేశ్వర్లు పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, నాయకులు జొన్న శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: ఉపాధి పనులకు కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో రాణి సిబ్బందికి సూచించారు. మండలంలోని తలాబ్ తండాలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీవో సూర్యకాంత్‌తో కలిసి ఆమె పరిశీలించారు. జాబ్ కార్డుల్లేని వారికి వెంటనే ఇవ్వాలని సూచించారు. పనుల వద్ద తాగు నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు.

నిజాంసాగర్: మండలంలోని నర్వలో ఉపాధి పనులను బుధవారం ఏపీవో శ్రీనివాస్ పరిశీలించారు. కొలత ప్రకారం కందకాలు తవ్వితేనే డబ్బులు వస్తాయని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వర్ ఉన్నారు.

ఉపాధి కూలీలకు అంబలి



సింగరాయిపల్లిలో కూలీలకు అంబలి ఇస్తూ..

రామారెడ్డి: మండలంలోని సింగరాయపల్లిలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూలీలకు బుధవారం అంబలి పంపిణీ చేశారు. ఎండలో పని చేస్తున్న కూలీలకు అంబలితో శక్తి పెరుగుతుందని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, విద్య కమిటీ చైర్మన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: కొలతలు ప్రాకారమే పనులు చేయాలని ఎంపీడీవో రఘు సూచించారు. మండలంలోని బొల్లారం, రాఘవపల్లిలో ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కూలీల సంఖ్య మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు సంతోష్, క్రిష్ణమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు పర్వీనా, మంగమ్మ తదితరులు ఉన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడి



మెంగారం పొలాల్లో శాస్త్రవేత్తలు

లింగంపేట: వ్యవసాయ అధికారులు సూచించిన డబ్ల్యూజీఎల్ 1119 వరి సాగు చేసిన రైతులకు అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రేవంత్‌నాథన్ వెల్లడించారు. బుధవారం ఆయన మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన ఉరడి బాలయ్య సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఆయన వెంట కోఆర్డినేటర్ మురళి, రైతులు సంపత్, మల్లయ్య, రవికిరణ్, నారాయణ ఉన్నారు.

రామారెడ్డి: తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏవో హరీష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉప్పల్‌వాయిలో ఏఈవో ప్రణీత, రైతు కమిటీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డితో కలిసి ఆయన పంటను పరిశీలించారు. మెడ విరుపు, కంకి నల్లి వంటి తెగుళ్ల సోకి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని, నివారణకు మందులు పిచికారి చేయాలని సూచించారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్లతో క్రీడాకారులు

రాజంపేట: క్రికెట్ అభిమానులకు రాజంపేట సొసైటీ డైరక్టర్ మీర్ వజాహత్ అలీ తన తండ్రి ఇంతియాజ్ అలీ జ్ఞాపకార్థం క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో మీర్ ఇమ్రాన్ అలీ, స్వామి, దశరథ్, అబ్బాస్ అలీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



నస్రుల్లాబాద్‌లో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పాల్త్య విఠల్ అధ్వర్యంలో పలువురు ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా నిరుపేద ముస్లింలకు బట్టలను పంపిణీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బావయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ పెర్క శ్రీనివాస్, గిర్దావార్ అంజు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో..

బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రఘు ముస్లింలకు రంజాన్ బట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు అంజిరెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో భాను ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఏఈవో శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

భిక్కనూరు: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మల కల్యాణం, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తున్కి వేణు, ఉప సర్పంచ్ బోడ నరషు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

సదాశివనగర్: ప్రమాదవశాత్తు మరణించిన సదాశివనగర్‌కు చెందిన ప్రసాద్ కుటుంబానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్, దాతల ద్వారా సేకరించిన రూ. 41 వేలు, సార్ల శ్రీనివాస్ అనే వ్యక్తి ఇచ్చిన మరో రూ. 30 వేలు అందజేశారు.

కళాశాలలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి వాసవీ కాలనీలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ తెలిపారు.

16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మద్నూర్: మండలంలోని మేనూర్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు 16న పరీక్ష నిర్వహిస్తామని పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

వడ్డీ రాయితీ చెక్కుల పంపిణీ

నిజాంసాగర్: స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ రాయితి రూ. 3.20 లక్షల విలువ చేసే చెక్కులను మాగి పంచాయతీలో అందజేసినట్లు సర్పంచ్ కమ్మరికత్త అంజయ్య, ఐకేపీ సీసీ సాయిలు సూచించారు.

పోస్టర్లు అతికిస్తే చర్యలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఉన్న పైలాన్, రోడ్ల డివైడర్లకు పోస్టర్లు అతికించినా, రాతలు రాసిన కఠిన చర్యలు తీసుకుంటామని మండల పరిషత్ అధికారి ప్రవీన్‌కుమార్ హెచ్చరించారు. వాటిపై అతికించిన పోస్టర్లను సిబ్బంది చేత ఆయన తొలగించారు.

రోడ్లపై ధాన్యం వద్దు

ఎల్లారెడ్డి: రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని ఎస్సై గణేష్ రైతులకు సూచించారు. అనుకోకుండా ఏవైనా ప్రమాదాలు జరిగితే వాటికి కారకులైన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక భరోసా

కామారెడ్డి క్రైం: సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందని ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 31 మందికి మంజూరైన రూ.22.76 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, ఏఎంసీ వైస్ చైర్మెన్ కుంభాల రవియాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు అధ్యక్షుడిగా నియామకం

లింగంపేట: జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షుడిగా మాల కమ్మరి వివేకానందను నియమించారు. ఈ మేరకు ఎల్లారెడ్డి నియోజక వర్గం ఇంచార్జి సాయికుమార్ బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బండి రాజయ్య, సంగమేశ్వర్, ప్రభాకర్, బాలరాజు, లక్ష్మన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.